# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకొనేందుకు పంచాయితీ నిధులను పెంచామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రకటించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్, ఒడిసా, తెలంగాణాల మీదుగా నూతన రైల్వే కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ తెలిపారు.
- ❖ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ❖ “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.
- ❖ సత్వర న్యాయం పొందటానికి జాతీయలోక్ అదాలత్ దోహదపడుతుందని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకొనేందుకు పంచాయితీలకు ఇస్తున్న నిధులను పెంచామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ రోజు అమరావతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఈ వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను, దేశానికి సేవలందించిన సైనికులను, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించే కార్యక్రమాలను నిర్వహించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు జెండా పండుగ విశిష్టత తెలిసేలా వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు 34 సంవత్సరాల క్రితం ఇచ్చిన జీవో స్థానంలో నిధులు పెంచుతూ... నూతన జీవోను జారీ చేశామని పవన్ కళ్యాణ్ వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి పనులలో పురోగతి ఉందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ రోజు ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు నూతనంగా భూముల కేటాయింపు జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడుతో రైల్వే జోన్ కోసం ఇప్పటికే చర్చించామని తెలిపారు. 7 వేల 383 కోట్ల రూపాయలతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల మీదుగా నూతన రైల్వే కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో 85.5 కిలోమీటర్లు, తెలంగాణాలో 19 కిలోమీటర్లు నూతన రైల్వే లైన్ నిర్మాణం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. తుఫాను వంటి విపత్కర పరిస్థితుల్లో ఈ లైనులో రైల్వేలు నడుపుతామని, గోదావరి నదిపై కూడా నూతనంగా వంతెన నిర్మిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

"హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం మూడవ విడతను ఈ రోజు గుంటూరు జిల్లా కలెక్టరేట్ పోస్ట్ ఆఫీస్ లో జాతీయ జెండాలను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, సామాజిక మధ్యమాలలో ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యయ ప్రయాసలు లేకుండా సత్వర న్యాయం పొందటానికి జాతీయలోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈరోజు జిల్లా కోర్టు ఆవరణలో ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలతో రానున్న సెప్టెంబరు 14న మూడవ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, కక్షి దారులు జాతీయ లోకాదలత్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని కోర్టులలో బెంచ్ లను ఏర్పాటు చేస్తున్నామని, లోక్ అదాలత్ లో కేసులను రాజీ చేసుకోవడం ద్వార సివిల్ కేసుల్లో కోర్టుకు చెల్లించిన రుసుమును కక్షి దారులు తిరిగి పొందవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ లో పరిష్కారం అయ్యే కేసులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని  జిల్లా ప్రధాన న్యాయమూర్తి G.శ్రీనివాస్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సైబర్ నేరాలకు వ్యతిరేకంగా విజయవాడ నగర పోలీసులు ఈ రోజు  చేపట్టిన "సైబర్ క్రైమ్ అవేర్ నెస్ వాక్ థాన్" కార్యక్రమానికి హోంమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ నేరస్తులు అమాయకులను నమ్మించి వారి ఖాతాల నుంచి లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారని అన్నారు. ఈ నేరాలకు పాల్పడిన వారికీ కఠిన శిక్షలు ఉంటాయని  అన్నారు. అపరిచితుల నుంచి మొబైలు ఫోన్లకు వచ్చే అసాధారణ సందేశాలు, వాట్సాప్ సందేశాలు,  మెయిల్స్ కు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 42 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ రోజు విజయనగరం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేస్తామని మంత్రి తెలిపారు.

=========================

మెగా డీఎస్సీకి హాజరయ్యే 300 మంది గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ మేరకు పాడేరు ఐటిడిఏ పరిధిలోని 11 మండలాలకు చెందిన టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ నుండి ఐటిడిఏ కార్యాలయం నుండి దరఖాస్తులను పొందవచ్చని, 17వ తేదీలోగా దరఖాస్తులను ఐటిడిఏ కార్యాలయంలో అందజేయాలని కోరారు. టెట్ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికైన తుది జాబితాను ఈనెల 20వ తేదీన ప్రకటిస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని ప్రాజెక్టు అధికారి తెలిపారు.

=========================

ఆర్టీసీలోని సమస్యలను దశలవారీగా, ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం పరిష్కరిస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. కర్నూలు డిపో గ్యారేజీలో 4 కొత్త బస్సులను పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డితో కలిసి మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం ప్రజలు ఎక్కువగా ప్రయాణించే మార్గాలలో కొత్త బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా జిల్లాలో ఎమ్మిగనూరు నుండి కర్నూలు, హైదరాబాద్, ఆదోని నుండి కర్నూలు మీదుగా శ్రీశైలంకు గత నెలలో ఆరు బస్సులను ప్రారంభించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

=========================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఈనెల 15వ తేదీన పవిత్రాల ప్రతిష్ఠ, 16వ తేదీన పవిత్ర సమర్పణ, 17వ తేదీన పూర్ణాహుతి కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనున్నది. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉత్సవమూర్తులకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనాన్ని అర్చకులు నిర్వహించనున్నారు.

=========================

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ఈరోజు విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రజలను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని.. బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

=========================
=========================